క్లుప్తంగా

రోటరీ సంస్థకు రూ.83 వేల విరాళం


విరాళం సొమ్ము అందిస్తున్న అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు

నిడదవోలు: రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-3020 అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు తన సొంత నిధులు రూ.83 వేలను అంతర్జాతీయ రోటరీ సంస్థకు విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ చేతుల మీదుగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులుకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావును క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ విరాళాన్ని న్యూఢిల్లీలో అంతర్జాతీయ రోటరీ ఫౌండేషన్‌కు పంపిస్తామని క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుంటుపల్లి శివకుమార్, కోశాధికారి కాళ్ల రాంబాబు, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో నా మట్టి- నా దేశం


తాళ్లపూడిలో అమృత కలశ యాత్ర

తాళ్లపూడి: తాళ్లపూడిలో శుక్రవారం 'నా మట్టి- నా దేశం' అమృత కలశ యాత్ర ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి ర్యాలీ మనవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎం. రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చిట్టిబాబు, వంబోలు పోశిబాబు, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, అలేఖ్య సువర్చల, ఆశా అలేఖ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

కొవ్వూరు: నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని వాడపల్లికి చెందిన గెల్లా సూర్యారావు (62) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కొవ్వూరు పట్టణ ఎస్సై డి. భూషణం కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సూర్యారావు ఈ నెల 16న మోటార్ సైకిల్‌పై వెళుతూ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదం ఔరంగాబాద్ శివార్లలోని ఇటుకల బట్టీ సమీపంలో చోటుచేసుకుంది. తలకు బలమైన గాయమైన సూర్యారావుకు కుటుంబ సభ్యులు తొలుత రాజమహేంద్రవరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. అనంతరం రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రిలో చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పట్టణ ఎస్సై డి.భూషణం తెలిపారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

పేదల ఆరోగ్య రక్షణకు సురక్ష

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- డివిజన్‌లో 8 చోట్ల వైద్య శిబిరాలు
- వేలాది మందికి ఉచితంగా ఉన్నత వైద్యం


దేవరపల్లి మండలం యర్నగూడెంలో రోగులకు పంపిణీ చేసే మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి

దేవరపల్లి: ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే నానుడిని నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా నిర్వహిస్తున్న సురక్ష వైద్య శిబిరాలు దిగ్విజయంగా కొనసాగుతున్నాయి. కొవ్వూరు డివిజన్‌లో శుక్రవారం ఎనిమిది చోట్ల ఈ శిబిరాలు నిర్వహించారు. మండలంలోని యర్నగూడెం సచివాలయం-1 పరిధిలోని జెడ్పీ హైస్కూల్ వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి ప్రారంభించారు. సర్పంచ్ బొంతా భరత్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని ఎమ్మెల్యే పర్యవేక్షించారు. వైద్య పరీక్షల గురించి డాక్టర్లను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 24 రకాల వంటకాల స్టాల్స్‌ను పరిశీలించారు. యాదవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి నాగదేవి మాట్లాడుతూ శిబిరంలో 552 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఐదుగురిని ఉన్నత వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసినట్టు తెలిపారు. డాక్టర్లు పి.అనిల్‌కుమార్, సీహెచ్ హరిచందన్, టి.సాంబశివరావు, సీహెచ్ చక్రవర్తి రోగులకు పరీక్షలు చేశారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా రోగులకు మందుల కిట్లు అందజేశారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు, మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, ఉప సర్పంచ్ నరహరిశెట్టి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు బొంతా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురంలో 170 మందికి..

గోపాలపురం: స్థానిక సచివాలయం- 3 వద్ద నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. శిబిరంలో వైద్యులు 170 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సర్పంచ్ పైడి శిరీష, ఎంపీటీసీ సభ్యురాలు వార సంగీత, తహసీల్దార్ బి. రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

కాటకోటేశ్వరంలో 396 మందికి..

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య ప్రారంభించారు. తాడిమళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు జి.సుధీర్‌కుమార్, దివ్య పర్యవేక్షణలో వైద్య నిపుణులు కాటకోటేశ్వరం, ఉనకరమిల్లి గ్రామాలకు చెందిన 396 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుంటుపల్లి రామచంద్రరావు, తిరుమలశెట్టి అయ్యప్ప, నాయకులు కోసూరి అప్పారావు, పోలిరెడ్డి శివరామకృష్ణ, రేలంగి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.గంగరాజు, కార్యదర్శి బి.మనోజ్ ప్రకాష్ పాల్గొన్నారు.


పెరవలి మండలం అజ్జరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు


కొవ్వూరు మండలం బంగారమ్మపేటలో మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ నారాయుడు

అజ్జరంలో 430 మందికి..

పెరవలి: అజ్జరంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు నిఖిల, కృష్ణతేజ, హేమరాజులు 430 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో 18 మందిని ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం కోసం ఉన్నతాసుపత్రులకు రిఫర్ చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి ఏహెచ్ విజయ్‌కుమార్ వెల్లడించారు. శిబిరాన్ని సందర్శించిన ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ చేతుల మీదుగా రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, సర్పంచ్ గార్లపాటి నాగసుధ, సురేష్ రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెలగదుర్రులో 420 మందికి..

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రులో సర్పంచ్ సాగి పద్మావతి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉండ్రాజవరం పీహెచ్‌సీ డాక్టర్ ఉషాదేవి (జనరల్ మెడిసిన్) ఆధ్వర్యంలో కార్తీక్ (ఆర్థోపెడిక్), ప్రశాంతి (గైనకాలజిస్ట్), ఇర్ఫాన్ (జనరల్ మెడిసిన్)లు 420 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. వారిలో 25 మందిని వివిధ ఆపరేషన్ల నిమిత్తం ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. రోగులకు సర్పంచ్ సాగి పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు ధనిశెట్టి భ్రమరాంబ మందులు పంపిణీ చేశారు. తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో జి.ఆర్‌కే రాజు, ముదునూరి సతీష్‌వర్మ, ముదునూరి నారాయణరాజు, చోళ్ళ శ్రీను, డి.మహేష్, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బంగారమ్మపేటలో 255 మందికి..

కొవ్వూరు: మండలంలోని వాడపల్లి-2 సచివాలయం పరిధిలోని బంగారమ్మపేటలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు) ప్రారంభించారు. దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.ధర్మరాజు, పలువురు వైద్య నిపుణులు కలిసి శిబిరంలో 255 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. పలువురికి ఈసీజీ తీశారు. అలాగే 72 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ గెల్లా ప్రసాద్, ఎంపీడీవో కె.సుశీల, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో 220 మందికి..

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామంలో సర్పంచ్ యాళ్ల స్వప్న ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ రమణ నాయక్ ఆధ్వర్యంలో వివిధ వైద్య విభాగాల ఏర్పాటు చేసి 220 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు యాళ్ల బాబూరావు, ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విత్తం నాని, నాయకులు కొమ్మిరెడ్డి పరశురామారావు, కుంటముక్కల కేశవనారాయణ, పోశిన శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు.

నిడదవోలులో 246 మందికి..


నిడదవోలు శిబిరంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న కమిషనర్ కేవీ పద్మావతి, డాక్టర్ హేనా

నిడదవోలు: పట్టణంలోని బసివిరెడ్డిపేట సచివాలయం పరిధిలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి జి. హేనా నేతృత్వంలో వివిధ విభాగాల వైద్యులు ఈ. తేజశ్రీ , ఆర్‌పీ వెంకటేష్ , తేజకిరణ్‌లు 246 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగులకు మునిసిపల్ కమిషనర్ కేవీ పద్మావతి చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. వారిలో 40 మందికి కంటి పరీక్షలు చేసి 21 మందికి కళ్లజోళ్లు అందించారు. కార్యక్రమంలో మేడపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, అడపా రాజు, బండి రాజేష్, చవ్వాకుల నాగు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వమిది.. అండగా నిలవండి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- వడ్లూరులో కొనసాగిన గడప గడపకూ..


వడ్లూరులో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ప్రజల కోసం పని చేసే ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి ఆదరించాలని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. మండలంలో వడ్లూరు గ్రామంలో శుక్రవారం మూడో రోజు ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి గడపకూ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రతి రైతుకూ మద్దతు ధర దక్కేలా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో వడ్లూరు సొసైటీ వద్ద ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2023 ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను ముందుగానే మొదలు పెట్టారన్నారు. రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు, సిబ్బంది పూర్తిగా సహకరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జేసీఎస్ మండల కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, సర్పంచ్ రఘుమండ తేజశ్రీ , ఎంపీటీసీ సభ్యురాలు వేండ్ర అనంతలక్ష్మి, తహసీల్దార్ జి.కనకరాజు, ఎంపీడీవో జి.ఆర్‌కే రాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొఠారు సత్యనారాయణ, ఏవో విశ్వాసరావు, పలవురు రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు బూర్ల సత్యనారాయణ, కడలి శ్రీను, వేండ్ర రమేష్, రఘుమండ శ్రీనివాసు, బయ్యే సత్తిపండు, ఆర్.నాగరాజు, అబోతు ముత్యాలు పాల్గొన్నారు.

మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతాం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రూ.1.60 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం
- మరికొన్నింటికి శంకుస్థాపన


22వ వార్డులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: అన్ని వార్డుల్లోనూ మౌలిక సదుపాయాలు కల్పించి నిడదవోలును మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలో శుక్రవారం రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభోత్సవం చేశారు. అలాగే పలు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధులు, 14,15 ఆర్థిక సంఘ నిధులు రూ.10 కోట్ల వ్యయంతో ఇప్పటికే రోడ్లు, మరో రూ.10 కోట్ల వ్యయంతో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టామన్నారు. మరి కొన్ని పనులకు శంకుస్థాపన చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. 21వ వార్డు నెహ్రూనగర్‌లో రూ.38.76 లక్షల వ్యయంతో పూర్తి చేసిన సీసీ రోడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. 22వ వార్డు వైఎస్సార్‌నగర్‌లో రూ.11 లక్షలతో నిర్మించిన హెడ్ వాటర్ వర్క్స్ ప్రహరీని, రూ. 13.52 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.12.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, రూ.28.56 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలను ఆయన ప్రారంభించారు. అదే ప్రాంతంలో రూ.10.10 లక్షలతో నిర్మించే సీసీ డ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగండి కృపానందం, కౌన్సిలర్లు షేక్ వసీరుద్దీన్, గోపిరెడ్డి శ్రీనివాస్, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, ఆరుగొళ్ళు వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు కొత్తూరు శ్రీను, గూడా మురళి, గంటా సురేష్, మున్సిపల్ డీఈ మాధవీలత, ఏఈ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

కులగణన ప్రకారం చట్టసభల్లో స్థానం కల్పించాలి

- నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గోపాలకృష్ణ
- సంఘం జిల్లా అధ్యక్షుడిగా మేడూరి వీర్రాజు ఎంపిక

కొవ్వూరు: కులగణన ప్రకారం చట్టసభల్లో నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పించాలని ఏపీ ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ కోరారు. నాయి బ్రాహ్మణ సంఘ జిల్లా సమావేశాన్ని శుక్రవారం పట్టణంలోని ఆ సంఘ కమ్యూనిటీ హాల్లో నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా మేడూరి వీర్రాజును, ప్రధాన కార్యదర్శిగా వద్దిపర్తి ప్రసాద్‌ను, కోశాధికారిగా పొన్నాడ సూరిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. ఎన్నికైన జిల్లా నూతన కమిటీని సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ వాయిద్య కళాకారులకు రుణాలు అందించి ఉపాధి అవకాశాలు మెరుగు పరచాలని కోరారు. 50 ఏళ్ల పైబడిన నాయీ బ్రాహ్మణులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివారపు శ్రీరాములు, వెన్నెటి సత్యనారాయణ, మల్లిమొగ్గల శ్రీనివాసరావు, కొమ్మన తాతారావు, తణుకు సూర్య, చింతలపూడి ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా ప్రదాయినీ .. నమోస్తుతే

- వీణాపాణి అలంకారంలో దుర్గామాత
- సరస్వతీ దేవికి విద్యార్థుల పూజలు
- పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన దాతలు


దేవరపల్లి బాలదుర్గమ్మ గుడి వద్ద విద్యార్థుల సరస్వతీ పూజలు


సరస్వతీ అలంకారంలో చీపురుగూడెం-తిమ్మన్నపాలెం కనకదుర్గమ్మ


సరస్వతీదేవి రూపంలో కొవ్వూరు కనక దుర్గమ్మ


ఖండవల్లి కనకదుర్గమ్మ సన్నిధిలో సామూహిక కుంకుమ పూజలు


చాగల్లులోని పాటమ్మపేటలో చిన్నారుల సరస్వతీ పూజలు


ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెంలో సరస్వతీ పూజలో విద్యార్థులు

దేవరపల్లి: చదువుల తల్లి సరస్వతీదేవిని విద్యార్థులు భక్తి శ్రద్ధలతో కొలిచారు. శరన్నవరాత్రుల ఆరో రోజైన శుక్రవారం మూల నక్షత్రం కావడంతో దుర్గామాతను సరస్వతీదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. సరస్వతీదేవి.. నమస్తుభ్యం అంటూ విద్యార్థులు పూజలు చేశారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యార్థుల పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి. దేవరపల్లిలోని బాలదుర్గమ్మ వారిని, మూడు రోడ్ల సెంటర్లోని సౌభాగ్య దుర్గాంబికా దేవిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

నల్లజర్ల: నల్లజర్లలోని నల్ల-ఎర్రచెరువు గట్టున గల వనదుర్గ ఆలయంలో అమ్మవారికి సరస్వతీ దేవిగా అలంకరించారు. భక్తులు పూజలు చేశారు.అనంతపల్లిలోని స్వర్ణ దుర్గాశ్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, మంజుల దంపతుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అన్న సమారాధన చేశారు. అనంతపల్లిలో ప్రసన్న విఘ్నేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో హరినామ సంకీర్తన జరిగింది. చీపురుగూడెం-తిమ్మన్నపాలెం మధ్య గల కనకదుర్గమ్మ గుడిలో సరస్వతీదేవికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతపల్లిలోని అన్నపూర్ణాదేవి ఆలయంలో మహిషాసుర మర్దిని అమ్మవారి షష్టి రాత్రుల మహోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి.అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

పెరవలి: ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం పెరవలి, ముక్కామల, వెంకట్రాయపురం, కానూరు గ్రామాల్లో శుక్రవారం తెల్లవారు జాము నుంచే ఆలయాల వద్ద కుంకుమార్చనలు మొదలయ్యాయి. ఖండవల్లి కనకదుర్గమ్మ ఆలయం వద్ద వందలాది భక్తులు సామూహిక పూజలు చేశారు. అన్నవరప్పాడు శక్తమ్మతల్లి ఆలయం వద్ద మహిళలు కుంకుమ పూజలతో పాటు సామూహిక వ్రతాలు చేశారు.

కొవ్వూరు: పట్టణంలోని మెరక వీధిలోని కనకదుర్గమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన మిచ్చారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీ మాతకు సామూహిక కుంకుమ పూజలు చేశారు. గోష్పాద క్షేత్రంలోని సరస్వతీ అమ్మవారి ఆలయంలోను శరన్నవరాత్ర వేడుకల్లో భాగంగా చండీ హోమం నిర్వహించారు.

తాళ్లపూడి: తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ వారిని సరస్వతీ దేవి అలంకరించారు. విద్యార్థులు పెన్నులు, పుస్తకాలు ఉంచి సరస్వతీ దేవీకి సామూహిక పూజలు చేశారు. గాయత్రీ మందిరంలో పరస రాధాకృష్ణ విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు చేయించారు.

వేగేశ్వరపురం వేంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యార్థులు, మహిళలు సరస్వతీదేవికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మలకపల్లి కనకదుర్గమ్మ గుడిలో అమ్మవారికి పూజలు నిర్వహించారు.

చాగల్లు: స్థానిక మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. భక్తులు కుంకుమ పూజలు చేశారు. అలాగే మహాలక్ష్మమ్మ ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు.వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. కలశాలతో పూజలు చేశారు.మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ధనలక్ష్మి అమ్మవారిని తామర పుష్పాలతో అలంకరించారు. చాగల్లు గ్రామదేవత పాటమ్మ వారి దేవాలయంలోను, పాటమ్మపేటలోను మీనానగరంలోని ముత్యాల దిబ్బ వద్దగల అమ్మవారికి భవానీలు, మహిళలు పూజలు చేశారు.

ఉండ్రాజవరం: మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవార్లు సరస్వతీదేవి ఆలంకరణలో దర్శనమిచ్చారు. ఉండ్రాజవరం బ్రహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో అమ్మవారికి లలిత సహస్రనామ కుంకుమ పూజ నిర్వహించారు. పాలంగిలోను, సూర్యారావుపాలెం పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద, తాడిపర్రులోను సరస్వతీ దేవి పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూల నక్షత్రం కావడంతో చిన్నారులు సరస్వతీ పూజలు నిర్వహించారు. శాంతినగర్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు.

కోట సత్తెమ్మ సన్నిధిలో సరస్వతీ పూజలు

- పాల్గొన్న 800 మంది విద్యార్థులు
- వారందరికీ పుస్తకాల పంపిణీ


సామూహిక సరస్వతీ పూజలో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు

నిడదవోలు రూరల్: దేవీ నవరాత్రుల సంబరాలు అంబరాన్నంటాయి. తిమ్మరాజుపాలెంలో కొలువైన కోట సత్తెమ్మ వారి దర్శనానికి ఆరో రోజైన శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి 760 మంది దంపతులు సహస్ర నామ కుంకుమ పూజలతో పాటు చండీ పారాయణం, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, సుమలత దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సుమారు 800 మంది విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజల్లో పాల్గొన్నారు. వారందరికీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు దంపతులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.3,40,124 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) చెప్పారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ధర్మకర్తల మండలి సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కంసాలిపాలెం శ్రీదేవి పాటెమ్మ వారు, గోపవరం గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద సరస్వతీ పూజలు జరిగాయి. ఇక సమిశ్రగూడెంలో పుంతలో ముసలమ్మ ఆలయాల వద్ద విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. డి.ముప్పవరంలో కొండాలమ్మ, లోహియా నగర్‌లో కనకదుర్గమ్మ వార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మునిపల్లిలో శ్రీలక్ష్మీనారాయణస్వామివారికి గాజులతో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు.

అలరించిన నృత్య రూపకాలు


శ్రీనివాస కల్యాణం నృత్య రూపకంలోని ఓ దృశ్యం

పెరవలి: శరన్నవరాత్రుల సందర్భంగా ఖండవల్లిలోని కనకదుర్గమ్మ వారి ఆలయం వద్ద గురువారం రాత్రి అదే గ్రామానికి చెందిన నృత్య ప్రియ అకాడమీ కళాకారులు చేసిన భరత నాట్య ప్రదర్శన కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. రామాయణం, భారతం, అమ్మవార్ల జీవిత ఇతివృత్తాలను వివరిస్తూ ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను అలరించాయి. ముఖ్యంగా నర్తన గణపతిం, అష్టలక్ష్మి స్తోత్రం, శ్రీనివాస కల్యాణం, మహిషాసుర మర్దిని స్తోత్రం, అమ్మోరు నృత్య రూపకాలు ప్రేక్షకులను రంజింపజేశాయి.